మినీ కథ

# అపురూప

వీరవల్లి వీణావాణి

అపురూప మాకు సీనియర్.

పైగా ఆ అమ్మాయి న్యూ హాస్టల్లో ఉంటోంది. నేనుండేది ఓల్డ్ హాస్టల్లో. అందుచేత ఆ అమ్మాయితో నాకు పరిచయం తక్కువ. అంతేగాక నా మనస్తత్వం చాలా విచిత్రమైంది. నాకు కలుపుగోలుతనం తక్కువ ఎప్పుడూ ముభావంగా ఉంటాను. అపురూపతో నాకు పెద్దగా పరిచయం లేక పోడానికి యిదీ ఓ కారణమే.

నేను ఎం. ఏలో చేరి రెండు నెలలు కావస్తోంది.

ఎం.ఏలో చేరకముందు .. యూనివర్సిటీ జీవితాన్ని గురించి నేను ఎన్నో రంగుల కలలు కన్నాను. తీరా ఎం. ఏలో చేరి హాస్టల్లో రెండు నెలలు గడిచేసరికి...ఈ హాస్టల్ జీవితం మీద అసహ్యం పుడుతోంది. హాస్టల్లో అందమైన అమ్మాయి అందంగా లేని అమ్మాయిలతో స్నేహం చెయ్యదు. వాళ్ళతో షాపింగ్‌కు వెళ్ళదు. ఒకే కులానికి చెందిన అమ్మాయిలందరూ ఒకే జట్టుగా ఉంటారు. తక్కువ కులం అమ్మాయిలను అసహ్యించుకొనేవాళ్ళు కొంత మంది. మంచి మంచి ఖరీదైన బట్టలు.... టేప్ రికార్డర్స్, ఫారిన్ కెమెరాలు మొదలైన విలువైన వస్తువులు గల అమ్మాయిలతో స్నేహం చేసి అస్తమానమూ వాళ్ళని ఛత్రాజుల్లా పొగిడేవాళ్ళు కొంత మంది. ఏ అమ్మాయో వాళ్ళ క్లాసు అబ్బాయితో మాట్లాడుతుంటే....చూసి వాళ్ళిద్దరి మధ్య లేనిపోని సంబంధాన్ని వాళ్ళకు అంటగట్టి ఒక హిట్ పిక్చర్‌కి సరిపోయే కథను తయారు చేసే వాళ్ళు కొంతమంది. నిజానికి హాస్టల్ ఒక ఉక్కబీలాగా అన్పించింది నాకు.

అందంగా ఉండే అమ్మాయిలు.... తమ ప్రిస్టేజి ఎక్కడ దెబ్బతింటుందోనని అందంగా లేని అమ్మాయిలతో స్నేహం చెయ్యరు, వాళ్ళతో షాపింగ్‌లకు సినిమాలకు పిక్నిక్‌లకు తిరగరని ఎవరో చెబితే నేను నిజం అనుకొన్నాను. కానీ....అపురూప అందుకు విరుద్ధం. ఆ అమ్మాయి.... అందంగా లేని వాళ్ళతోనే స్నేహం చేస్తుంది. వాళ్ళతోనే సినిమాలూ పిక్నిక్‌లూ వెళుతుంది. తాను అందమైన దాన్నని డబ్బున్న అమ్మాయినని ఎప్పుడూ గర్వపడదు. ఇలా చాలా మంది అపురూపను గురించి హాస్టల్లో చెప్పుకొంటుంటే....నేనూ నమ్మక తప్పలేదు

ఆ రోజు... ఆదివారం మధ్యాహ్నం.... భోజనం చేశాక నా ఫారిన్ నైలెక్స్ చీరని ఉతికి రూం ముందు వైర్ మీద ఆరబెడుతుంటే...."హల్లో శోభా!" అంటూ మా రూంకొచ్చింది అపురూప.

"రండక్కయ్యా కూర్చుండరు" అంటూ ఓ చిరునవ్వు నవ్వి రూంలోకి తీసుకెళ్ళి... ఓ కుర్చీలో కూచో బెట్టాను అపురూపను.

"శోభా! నాకో సందేహం. ప్రీవియస్ వాళ్ళందరూ ఎందుకు ఫైనల్ వాళ్ళను అక్కయ్యా అని పిలుస్తారు? పేరు పెట్టి పిలిస్తే చాలు అన్నట్టు మనం యివాళ మ్యాట్నీకి వెళ్ళాలి"

"లేదక్కా మీరు వెళ్ళిరండి" అన్నాను.

"ఏదేం కుదరదు. నువ్వూ రావాల్సిందే అయినా... నలుగురితో కలవకుండా ఒంటరిగా ఉండిపోతే ఎలా శోభా?" అంటూ మ్యాట్నీకి బలవంతం చేసింది.

అపురూప బలవంతం చెయ్యడంతో యిక బయల్దేరక తప్పింది కాదు. "సీతా! నేను పిక్చర్ కెళ్ళుతున్నా చీర ఆరిపోగానే తీసి రూంలో పడెయ్యి" అంటూ మా రూంమేట్‌కు చెప్పి అపురూపతో బయలుదేరాను.

రెండు గంటలకు డి. ఆర్. మహల్ రిక్షా దిగాం

మేము మొత్తం ఆరుమంది అమ్మాయిలం రిక్షాలతో వచ్చాం. వ్యానిటీ బాగ్ లోంచి టికెట్స్ తీసుకోటానికి నేను డబ్బు తీసుకొంటూ ఉండగానే అపురూప తనే ఆ టికెట్స్ పట్టుకొచ్చింది. సినిమా అయిపోయాక అయిదున్నరకు క్షీమా హోటల్లో ఎ. సి. రూంలోకెళ్ళి కూర్చున్నాం. టిఫిన్ పూర్తి అయ్యాక డబ్బు నేను యిస్తుంటే నాతో పోట్లాడి అపురూప తనే బిల్లు చెల్లించింది. చివరకు హాస్టల్ ముందు రిక్షా దిగాక ఛార్జి కూడా .. ...నేనిస్తుంటే ఒప్పుకోకుండా...తనే మూడు రిక్షాలకు ఛార్జి యిచ్చేసింది.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు

నా బుర్ర నిండా అపురూపను గురించిన ఆలోచనలే. నాకో బలహీనత ఉంది. అదేమిటంటే... ఒకరితో కాస్త పరిచయం కాగా ఏర్పడ్డాక ఆ వ్యక్తిని గురించి ఆలోచించి. ఆ వ్యక్తి ప్రవర్తనను మాటలను పరిశీలించి వారిమీదొక అభిప్రాయాన్ని ఏర్పాటు చేసుకోవడం. అపురూపను గురించి చెడుగా చెప్పారు నాకు. కానీ... యివాళ అపురూప ప్రవర్తనను బట్టి... ఆమె పట్ల గౌరవం సదభిప్రాయం ఏర్పడింది నాకు. అంతే గాదు అందమైన వాళ్ళకు గర్వం ఉంటుందని .. ...వాళ్లు అందంగా లేని అమ్మాయిలతో స్నేహం చెయ్యరనే అభిప్రాయం నాలో కొంత వరకు ఉన్నప్పటికీ అపురూప పరిచయం వల్ల నా అభిప్రాయం తుడుచుకు పోయింది.

ఆ మరుసటి రోజు... ఉదయం...

"హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్" చదవాలనిపించి పింగళి లక్ష్మీకాంతం గారు రాసిన పుస్తకం కోసం అపురూప వాళ్ళ రూంకెళ్ళి ఆ అమ్మాయిని అడిగి తెచ్చుకొన్నాను. మా రూంలో బెడ్ మీద పడుకొని ఆ పుస్తకం తెరవగానే... అందులోంచి మడతలు పెట్టబడిన ఓ కాగితం జారి పడింది. మెల్లగా అందుకొని మడతలు విప్పాను. అది...అపురూప జానకి అనే తన ఫ్రెండ్‌కి రాసిన ఉత్తరం. పరాయి వాళ్లు రాసిన ఉత్తరాల్ని చదవ కూడదని అనుకొంటూనే... చదవ సాగాను.

అంతే .. ... నా బుర్రలో డైనమేట్ ప్రేలింది

నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. అపురూప అంతరంగం.. .యింత కలుషితమైందా? ఇలాంటి మనస్తత్వం గల అమ్మాయిలు కూడా ఈ సమాజంలో ఉన్నారా? అపురూప విషయంలో నేనెంత మోసపోయాను! మళ్ళీ ... .. నాకళ్ళు ఆ లెటర్ని చదవడం మొదలెట్టాయి.

"డియర్ జానకీ! నీ ఉత్తరం అందింది అందంగా లేని వాళ్ళతో, పేద వాళ్ళతో, తక్కువ కులం వాళ్ళతో స్నేహం చెయ్యడంలో అర్థం ఏమిటి అని అడిగావు కదూ చెబుతాను విను నాలుగు కాకులతో కలిసి హంస ఉంటే అందరి చూపులూ ఆ హంస మీద పడి తీరుతుంది. అవునా? అందంగా లేని వాళ్ళతో కలిసి బజార్లో నడుస్తుంటే ....అందరి కళ్ళు నా మీదే పడతాయి నన్నే కామెంట్ చేస్తారు. నాకెంతో గర్వంగానూ ఉంటుంది. ఒకరికి మనం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతున్నామంటే... వాళ్ళు మనకు లొంగుతున్నారన్న మాట-డబ్బు ఖర్చు పెడుతుంటే ...ఆ క్రెడిట్ మనకు మిగులుతుంది వాళ్ళు మనకెంతో అణగిమణిగి ఉంటూ మనల్ని గౌరవిస్తారు"... ఇక ఆ ఉత్తరాన్ని చదవడం యిష్టంలేక మడతలు పెట్టి ఆ పుస్తకంలో పెట్టేశాను—

*